# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలల్లో పర్యటించారు.
- ❖ కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు విశాఖలో పర్యటించనున్నారు.
- ❖ అకాల వరదల కారణంగా నష్ట పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
- ❖ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్రని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలల్లో పర్యటించారు. ముందుగా ఎనికేపాడు నుంచి పొలాల మీదుగా ప్రయాణించి రైవస్ కాలువ, ఏలూరు కాలువ దాటి బుడమేరు ముంపు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. బుడమేరుకు పడిన గండ్లను పూడ్చే పనులపై ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. బుడమేరు డ్రైన్లో వరద ఉధృతి వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని, రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అక్కడి నుంచి మధురానగర్ వెళ్లిన ముఖ్యమంత్రి.. ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే దేవినగర్, పుసుపుతోట, సింగ్ నగర్ గవర్నమెంట్ ప్రెస్ పరిధిలో ముఖ్యమంత్రి పర్యటించారు.

=======================

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు విశాఖలో పర్యటించనున్నారు. మత్స్య సంపదను ప్రోత్సహించడంలో భాగంగా రొయ్యల పెంపకం, ఎగుమతులపై రేపు విశాఖపట్నంలో జరుగనున్న కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్, రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొననున్నారు. కాగా భారత ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన మత్స్యరంగం జాతీయ ఆదాయం, ఎగుమతులు, ఆహార భద్రతలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ రంగాన్ని ఆధారంగా చేసుకుని 3 కోట్ల మంది జీవనోపాధి సాగిస్తున్నారు. అలాగే ప్రపంచంలో భారత్ రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా ఉంది.

=======================

అకాల వరదల కారణంగా నష్ట పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. ఈరోజు గుంటూరు జిల్లా కొల్లిపర, బొమ్మవానిపాలెం గ్రామాలలో ముంపునకు గురైన అరటి, పసుపు, నిమ్మ తదితర పంటలను పరిశీలించిన మంత్రి, రైతులతో మాట్లాడి నష్టపోయిన పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటలపై రైతులు పెట్టిన పెట్టుబడి, పంట బీమా, ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక, మట్టి పరిమితికి మించి తవ్వటం వల్ల కట్టలు బలహీనపడి ఇంత నష్టం వాటిల్లిందన్నారు. ఇకపై ఇటువంటివి జరగకుండా సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తామని, ప్రస్తుతం నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సహాయం, బీమా మొత్తాన్ని వీలైనంత త్వరగా అందించి, తరువాత పంటలకు విత్తన, ఎరువుల సబ్సిడీ వెంటనే వచ్చేలా చూస్తానని కేంద్రమంత్రి వెల్లడిస్తూ.....

(వాయిస్ 35 సెకన్లు)

=======================

ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని స్థానిక అంబేద్కర్ కళావేదికలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం రోజున ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకునే అవకాశం దక్కిందన్నారు. అటువంటి వారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సంతృప్తి మిగిలిన రంగాల్లో ఉండదని పేర్కొన్నారు. శిలను శిల్పంగా తీర్చి దిద్దే శక్తి ఒక్క గురువులోనే ఉందని, విద్యతో పాటు మానవీయ విలువలు, ఆటలపై ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియచెప్పే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ఎంపికైన 78 మంది ఉపాధ్యాయులకు కేంద్రమంత్రి జ్ఞాపికలను అందజేశారు.

=======================

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచనల మేరకు ఈరోజు నుంచి రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగనుంది. ఈ రోజు విజయవాడతో పాటు రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి, బాధిత కుటుంబాలు, రైతులతో మాట్లాడారు. అనంతరం విజయవాడలో అధికారులతో సమావేశమై, వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టంపై అంచనాలు రూపొందించే అంశంపై కేంద్రమంత్రి పలు సూచనలు చేశారు. అలాగే రేపు తెలంగాణ రాష్ట్రంలో శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాతో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఇతర ప్రాంతాల్లోనూ ఆయన పర్యటన కొనసాగనుంది.

విరామం

=======================

పశ్చిమ మధ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతం వద్ద ఉత్తర ఆంధ్ర ప్రదేశ్ - దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దానికి అనుబంధం ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎగువన విస్తరించి ఉందని, ఇది వచ్చే 2 రోజుల్లో ఉత్తరం దిశ వైపు పయనిస్తుందని తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటలలో ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాలలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారిణి పేర్కొంటూ ......

(వాయిస్ 25 సెకన్లు)

=======================

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి రేపు సాయంత్రంలోగా పంపించాలని కోరారు.

=======================

విజయవాడలో వరద ముంపునకు గురైన బాధితులందరికీ పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖల ద్వారా రేపు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈరోజు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ఆయన పత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నడూ చూడని వరదలను చూశామని, కాని ఈసారి వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం అహర్నిశలు పని చేసి సహాయ చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు. రేపు ఉదయం నుండి విజయవాడలోని 179 వార్డు, 3 గ్రామ సచివాలయాల పరిధిలో వరద బాధితులకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో వంట నూనె, కిలో పంచదార, 2 కిలోల ఉల్లి పాయలు, 2 కిలోల బంగాళా దుంపలను పంపిణీ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఒక్క రోజులోనే నిత్యావసర సరుకుల పంపిణీని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.

=======================

చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పట్టెం గురుప్రసాద్ తెలిపారు. కాణిపాకం ఆలయ ఆవరణలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దేవుళ్లందరిలో తొలి పూజ అందుకునే వినాయకుడి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 21 రోజులపాటు జరుగనున్నాయని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 450 మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేస్తున్నామని.. ఆలయ ప్రాంగణ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

=======================

వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన మంత్రి వైద్య  శిబిరాలు ఏర్పాటు చేసి వృద్ధులు, గర్భిణీలకు మూడు పూటల ఆహారం, అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. శిబిరాల  ద్వారా 67 రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఒక డాక్టర్, ఇద్దరు సూపర్ వైజర్లు, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు.

========================

========================